

ఆ పేటలో కొన్ని గుడిసెలు అప్పటికే గంజి తాగి గుర్రు పెట్టి నిద్ర పోతూంటే, మరి కొన్ని గుడిసెలు మందు ఎక్కువై మూర్ఛరోగుల్లా తూలుగుతున్నాయి. ఆ గుడిసెల చివర ఒక గుడిసెలో గుడ్డి లాంతరు వెలుగుతూంది.

ఆ లాంతరు వెలుగులో అమ్మ పెట్టిన అన్నం సత్తు గిన్నెలో తిని, చేయి కడుక్కున్నాడు చంద్రం. లేచి లాంతరు గూట్లో పెట్టబోతుంటే బయట గాలి గుడిసెలోకి తోసుకొచ్చింది. ఒక వైపు అద్దం లేని దీపం, విలవిల లాడుతూ ఆరిపోయింది. భయంతో ఆరిపోయిన లాంతరు అక్కడే వదిలేసి గుడిసె చూరుకింద కొచ్చాడు చంద్రం. 'అమ్మా!' అని పిలిచాడు. అమ్మ అసిరమ్మ పలకలేదు. చంద్రానికి భయం ఎక్కువయింది.

బయట చీకటి చిక్కగా ఉంది. దూరంగా వీధి చివర రెండు కుక్కలు కచ్చిపోయి అరుస్తున్నాయి. చంద్రం చీకట్లో తడుముకుంటూ వాకిలి ముందు వేపచెట్టు దగ్గర కొచ్చాడు. చెట్టు కింద నులక మంచం కోడు కాలికి తగిలింది. మంచంలో కూర్చుంటూ మళ్ళా "అమ్మా!" అంటూ గొంతు పెంచి పిలిచాడు. ఈ సారి అసిరమ్మ పలికింది. అసిరమ్మ వేపచెట్టు పక్కనే తడికెల మధ్య నీళ్ళోసుకుంటూంది.

"ఏరా! వణ్ణం తిన్నావా! తింటే నోరు మూసుకుని మంచంలో పడుకుండి పో!"

అమ్మ కంఠం వినబడటంతో చంద్రానికి కొంత భయం తీరింది. మంచంలో వెల్లకిలా పడుకున్నాడు. ఆకాశంలో చంద్రుడు దాగుడుమూత లాడుతూ మబ్బుల చాటున దాక్కున్నాడు. అక్కడక్కడా చుక్కలు నిక్కి నిక్కి చూస్తున్నాయి. అసిరమ్మ తడికెల మధ్య నుంచి గుడిసెలో కెళ్ళింది.

"ఏరా! యెధవ సచ్చినోడా! మళ్ళీ లాంత రార్పేసినావేటి? నా బతుక్కి నువ్వుకూడ దాపరించినావురా ముదనష్టపోడా!" అసిరమ్మ దీపం వెలిగించింది.

వేపచెట్టు కింద పడుకున్న చంద్రానికి చల్లటి గాలి అమ్మ తిట్లన్నీ మోసుకొస్తూ 'నోరు మూసుకుని పడుకో' అంది. 'అమ్మ ఈ రోజైనా పక్కన పడుకుంటే ఎంచక్కా నిద్ర పోవచ్చు. అమ్మ తన పక్కన పడుకుంటుందో, లేదో!' అనుకున్నాడు చంద్రం.

"అసిరీ!" పదునైన గొంతు ఆ చీకట్లో గుర గురలాడింది.

ఉదురుపాటుతో లేచాడు చంద్రం. ఎదురుగా చీకట్లో తెల్లని బట్టల్లో పొడవైన ఆకారం. నోట్లో చుట్ట. చుట్ట చివర మండుతూన్న నిప్పు కణిక.

అసిరమ్మ ఒక్క ఉదుటున గుడిసెలోంచి బయటి కొచ్చింది. గొంతు తగ్గించి "రండి! రండి!" అంటూ ఆనందం నిండిన స్వరంతో గుడిసెలోకి ఆహ్వానించింది. ఆ వ్యక్తి హుందాగా అసిరమ్మను అనుసరించాడు. చంద్రానికి ఏడుపొచ్చింది. అమ్మ మీద చెప్పలేని కోపం వచ్చింది. ఆ వచ్చిన వ్యక్తిని కసితీరా గట్టిగా కొట్టాలనిపించింది. అమ్మ నవ్వులు వినబడుతున్నాయి.

"ఒరేయ్ సెంద్రిగా! పడుకుండి పో. బయం నేదులే."

'ఉహూ! నాకు బయ వేస్తుంది. నువ్వొచ్చి నా పక్కలోనే పడుకో. ఆణ్ణి పంపేయ్' అని గట్టిగా అరవాలనుకున్నాడు చంద్రం. కాని అరవలేకపోయాడు. అంతలో అసిరమ్మ గుడిసె తలుపు మూసేసింది. 'అమ్మ రోజూ ఇంతే" అనుకుంటూ, అసహనంగా మంచంలో దొర్లుతూ ఎప్పుడో నిద్రలోకి జారిపోయాడు చంద్రం. ఉదయానికి మాత్రం కళ్ళ కింద చారికలు, ఆ పసి హృదయంలో మళ్ళు తిరిగిన బాధకు గుర్తులుగా కనిపించాయి. ఆ పసి హృదయం వయస్సు అంబ్దేళ్ళు. ఆ అమ్మ వయస్సు పాతికేళ్ళు.

* * *

అసిరమ్మ తన కొడుకు చంద్రానికి బొత్తాము ల్లేని నిక్కరు, చిరుగులు పడినా కుట్టని చొక్కా తొడిగి గుడిసె నుండి బయటకు బరాబరా లాక్కొచ్చింది.

"అమ్మా! నాకు కొత్త బట్టలు కావాలే." చంద్రం ఏడుపుకు శ్రుతి చూసుకుంటూ, చిందులు తొక్కుతూ అడిగాడు.

"చీ! దరిద్రపు కొమ్మెదవా! నీ బతుక్కి కొత్త బట్ట లొకటి తక్కువయ్యినాయేటి? నిన్ను నా కడుపులో పెట్టి, నన్ను నట్టేట్లో ముంచి పారిపోనాడే ఆ దగుల్బాజీనోడు! ఆ యెదవొచ్చినప్పుడు కొంటాన్లే. పద!" అసిరమ్మ కోపంతో కేక వేసి కొట్టినంత పని చేసింది.

చంద్రం ఏడుపు నాపుకున్నాడు. ఒక చేత్తో ముక్కును తుడుచుకుంటూ, అదే చేత్తో జారిపోతున్న నిక్కరు పైకి లాక్కుని, రెండో చేతిలో పలకా బలపంతో తల్లికూడా నడుస్తున్నాడు. చంద్రం అయిదు రోజులనుంచి తల్లి బలవంతం మీద తాటాకుల బడిలో కెళుతున్నాడు.

ఎండ చిరచిర లాడుతూంది. రోడ్డంతా కంకర మట్టి. చంద్రం కాళ్ళకు ఒత్తుగా అంటుకుంటూంది. ఎదురుగా నీళ్ళు మోసే నరసమ్మ తన కూతుర్ని చంక నెత్తుకుని బళ్ళోకి తీసుకెళుతూంది. రావన్న తాత తన మనవణ్ణి భుజం మీద కెత్తుకున్నాడు. తనని ఎత్తుకోవడం కాదు కదా, రెక్క పట్టుకుని విసురుగా లాక్కెళ్ళడం, విసుక్కోవడం చూసి చంద్రానికి తల్లిమీద చాలా కోపంగా

ఉంది. రోడ్డు వార పడుకున్న తల్లి కుక్కపై కలియబడి అయిదారు పిల్లలు పాల కోసం కుమ్ములాడుతున్నాయి. కుక్క పిల్లల్ని చూస్తూ చంద్రం తల్లికూడా బడి దగ్గర కొచ్చారు. బడి దగ్గర గానుగ చెట్టుమీద కొంగలు అల్లరి చేస్తున్న పిల్లల్లాగ అరుస్తున్నాయి. గానుగ చెట్టు కింద మునలమ్మ ఒక గోనెపట్టా పరుచుకుని ఉడకపెట్టిన దుంపలు, చెగోడీలు, జంతికల పోగులుగా పెట్టి అమ్ముతూంది. తల్లీ కొడుకు లిద్దరూ బడిలో కడుగు పెట్టారు.

"బాబూ అప్పల్నాయుడుగోరూ! కూసంత బయం సెప్పి వాణ్ణి గొట్టర మ్మొక్క లొచ్చేలా సేయండి. బళ్ళో కెళ్ళమంటే తెగ సిల్గి పోతన్నాడు దరిద్రపు గొట్టెదవ!" ఆసిరమ్మ చంద్రాన్ని మేస్టారు అప్పల్నాయుడు గారికి అప్పగించింది.

'అమ్మకి తనని తిట్టడమే పని, కొట్టడమే అలవాటు' అనుకున్నాడు చంద్రం ఆసిరమ్మ వైపు చూస్తూ.

"అలాగే లేవే, ఆసిరీ! నువ్వంతగా చెప్పాలా యేటి? ఒరేయ్ చంద్రం! అలా కూర్చోరా. ఒసే ఆసిరీ! మధ్యాహ్నం మా అమ్మగారి కోసారి కనిపించు. ఆవకాయకి కారం కొట్టాలి."

"అలాగే, బాబూ!" ఆసిరమ్మ కదిలింది.

'అమ్మని అయిదు పైస లడిగితేనో! ఐస్ ఫ్రూట్ కొనుక్కోవచ్చు. అమ్మో! ఊహు! మాస్టారు కొడతారేమో.'

చంద్రం వెళ్ళిపోతూన్న తల్లి వైపు తదేకంగా చూస్తూ తటపటాయించాడు. ఆసిరమ్మ వెళ్ళిపోయింది.

అది తాటాకుల బడి. అప్పల్నాయుడు మాస్టారు గళ్ళచొక్కా, పొడుగు షరాయి తొడుక్కున్నారు. దళసరి కళ్ళద్దాలతో బావురు పిల్లిలా, బెత్తం వూపుతూ చంద్రం దగ్గర కొచ్చారు.

## శ్రీ కంఠస్ఫూర్తి

"ఒరేయ్! నీ పలకేదిరా?" చంద్రం పలకా, బలపం మాస్టారుచేతి కిచ్చాడు. మాస్టారు పలక మీద 'అ ఆ'లు రాశారు.


"ఈ పలక పుల్ల గట్టిగా పట్టుకో."

చంద్రం పలకపుల్ల గట్టిగా పట్టుకున్నాడు. మాస్టారు చంద్రం పక్కనే కూర్చొని అ, ఆలు దిద్దటం చూపించారు.

అ, ఆ లను దీర్ఘం తీస్తూ ఎలా చదవాలో చెప్పి చంద్రంతో అనిపించారు. బడి విడిచి పెట్టేవరకు అలాగే దిద్దమని బెదిరించి, బెత్తంతో కుర్చీ దగ్గర కెళ్ళిపోయారు. చంద్రం అక్షరాలు దిద్దుతున్నాడు. అ, ఆ అంటూ చదువుతూ దీర్ఘాలు తీస్తున్నాడు. కొంతసేపు దిద్దేసరికి అక్షరాలు లావుగా, బండగా తయారయ్యాయి. చేతివేళ్ళు కొద్దిగా నొప్పిగా ఉన్నట్లనిపించాయి. మరలా 'ఆ'ని దిద్దుతూంటే— చంద్రానికి అమ్మ రూపం మనసులో మెదిలింది. అమ్మ మీద కోపంతో 'అ'ని దిద్దటం మానేశాడు.

ఆసిరమ్మ పొద్దున్నే లేవగానే ఎవరింటికో కంగారుగా పనిలోకి పోతుంది. ఒక గంట తరవాత రెండిళ్ళల్లో పని పూర్తి చేసుకొని వచ్చి, నిద్రపోతున్న చంద్రాన్ని తిట్లతో లేపుతుంది. ముఖం కడుక్కున్న తరవాత సత్తు గిన్నెలో గంజి పోసి తాగమంటుంది. తాగకపోతే నెత్తిమీద గట్టిగా మొట్టి, పెద్దనోరు పెట్టి తిడుతుంది. చంద్రానికి పాపాయమ్మ హోటల్లో ఇడ్లీ తినాలని కోరిక. ఎన్నిసార్లు తల్లి దగ్గర కోరిక వెలిబుచ్చినా అది తీరలేదు. పోనీ, కావలసిందల్లా తండ్రి నడుగుదామంటే చంద్రానికి తండ్రి ఎలా ఉంటాడో తెలియదు. ఎక్కడున్నాడో అంతకంటే తెలియదు.

నాన్న ఎక్కడికో అమ్మ నొదిలి వెళ్ళిపోయాడట. అమ్మ అప్పుడప్పుడు ఏడుస్తుంది. అమ్మ ఏడిస్తే అమ్మను పట్టుకొని తనకీ ఏడవాలనిపిస్తుంది. అమ్మ తనను దగ్గరికే రానివ్వదు. తన లెప్పుడూ రాత్రిళ్ళు అమ్మ దగ్గరే పడుకోవా లనుకున్నా, తన దగ్గర అమ్మ ఎప్పుడూ పడుకోదు. అతనెవరో రాత్రిళ్ళు పంచె కట్టుకొని చుట్ట కాలుస్తూ వస్తాడు. అతను రాగానే తనని బయట నులక మంచంలో పడుకోమని చెప్పి నవ్వుతూ తలుపేసుకుంటుంది. ఆయన పక్కనే పడుకోవటం, ఏమిటో! తనకు నాన్నలేడట! మరి అత నెవరో! అతన్ని చూస్తే తనకు ఒళ్ళుమంట. కుక్కనుకొట్టే కర్రతో గట్టిగా తలమీద కొట్టాలన్నంతకోపం





అసలు తప్పంతా అమ్మదే! అమ్మ మంచిదికాదు.

అమ్మగురించి ఆలోచిస్తూ 'అ' ని దిద్దటం మానేసి చంద్రం అయోమయంగా చుట్టూ చూశాడు. చంద్రం పక్క వరసలో ఇద్దరు కుర్రాళ్ళు జేబులోని చేగోడీలు, మాస్టారు చూడకుండా పలక అడ్డం పెట్టుకొని తింటున్నారు. నోరూరినా, తిరిగి రెండవ అక్షరం 'ఆ' ని దిద్దుతూ దీర్ఘం తీస్తూంటే, కడుపులో ఆకలిగా ఉన్నట్టనిపించింది. పొద్దున్న అమ్మ గిన్నెలో పోసిన గంజిమాత్రమే తాగాడు.

ఆసిరమ్మ మధ్యాహ్నం రెండు గంటలకి ఎవరింటి దగ్గర్నుంచో గిన్నెల్లో అన్నం పెట్టుకొస్తుంది. అప్పటివరకూ చంద్రం ఆకలితో నకనకలాడాల్సిందే! చంద్రానికో సందేహం. తనకు ఆకలివేస్తే తినడాని కేమీ ఉండదు. కొనుక్కోడానికి డబ్బులుండవు. మిగతా పిల్లలంతా ఎంచక్కా తెల్లటి బట్టలు కట్టుకుంటూటారు. ఐస్ ఫ్రూట్‌లు, జంతికలు అన్నీ కొనుక్కుంటారు. వాళ్ళందరికీ డబ్బు లెక్కణ్నుంచి వస్తాయో? తను అమ్మ నడిగితే డబ్బుల్లేవని ఎందుకు విసుక్కుంటుందో అర్థంకాదు. పాపాయమ్మ దగ్గరి కెళితే "ఫో వెధవా!" అంటూ కసిరి కొడుతుంది. చంద్రం తల్లి వచ్చే వరకు కుండలో నీళ్ళు ముంచుకుని తాగి పడుకోవాల్సిందే.

చంద్రానికి అ, ఆలు దిద్దా లనిపించటంలేదు. అవి దిద్దుతూంటే అమ్మ గుర్తు వస్తూంది. ఆకలి కడుపులో కరకర మంటూంది.

చంద్రం మాస్టారి దగ్గర కెళ్ళి, చేతి వేళ్ళు బాలుగా చూపి చిటికెన వేలు చూపించాడు. "పో వెధవా! త్వరగా వచ్చేయ్." మాస్టారు కసురుకుంటూ నల్లబల్ల వైపు తిరిగి రాసుకోసాగారు. చంద్రం మెల్లిగా తనచోటు దగ్గరికి వచ్చి పలక తీసుకుని దాన్ని చొక్కాలోపల కడుపు మీద దాచి, మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ పిల్లల్ని తప్పించుకుని పిల్లిలా బయటికి వచ్చేశాడు. గానుగ చెట్టు కింద మునల్దింకా దుంపలు, జంతికలు, చేగోడీలు పోగులు పెట్టి అమ్ముతూంది. గోనె పట్టానిండా ఈగలు జోరుగా ముసురుతున్నాయి.



"మామ్మా! ఒక దుంప పెట్టవా!"

"మైసలు తీస్కురా! లేవూ? పోరా పో. ఒరి నీ కడుపులో నిప్పెట్టా! దుంపెట్ట లేదని కాల్తో ఇనకజల్లి లగెత్తుకుపోతావా! రేపొత్తావు గదరా! గుంట నాకొడకా. నీ కాళ్ళిరగ్గొడతా!"

చంద్రదం పరుగెడు తున్నాడు. కడుపులో ఆకలిగా ఉంది. అమ్మ ఎవ రింటి దగ్గరుందో? ఎక్కడుందో? అనుకుంటూ రోడ్డు మీద కంకర రాయిని గట్టిగా తన్నేశాడు. గోరుచితికి సలుపుతో బాటు రక్తం సలసల రాసాగింది. రక్తం చూడగానే ఏడుపు ఎగదన్ని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

చంద్రదం మలుపు తిరిగి పెద్ద రోడ్డు మీద కుంటుతూ నడుస్తున్నాడు. రోడ్డు పక్క మైదానంలో పందిరి కళకళలాడుతూంది. రంగు రంగుల కాగితాల తోరణాలు ఎగురు తున్నాయి. గుంపులు గుంపులుగా గుమికూడిన జనం సందడి. పందిరి మధ్య నిలబడి స్టేజీ మీద మైకులో మాట్లాడుతూన్న 'ఖద్దరు టోపీ' ఖరీదైన మాటలు వినబడు తున్నాయి.

"మహాజనులారా! మనం పిల్లల పండుగ జరుపు కుంటున్నాం. ఈ పండుగ సందర్భంలో మేము పిల్లలకి కొన్ని ప్రత్యేకమైన సదుపాయాలు సమకూర్చాలని పథకాలు వేస్తున్నాము. మీకు తెలుసు—మనలో మన పరిసరాల్లో ఎంతో మంది పిల్లలు తిండీ, గుడ్డా, తగిన ఆదరణ నోచుకోక అనాథలుగా రోడ్ల మీద బ్రతకటం. అందువల్ల నే చెప్పేదేమంటే..."

చంద్రదానికి ఆ పందిరిలో కెళ్ళి జనం మధ్య కూర్చోవాలని పించింది కాని, కడుపులో ఆకలి ఎక్కువయింది. కాలిగోరు తెగ సలుపుతూంది. ఇంకా ముందుకు నడిచాడు చంద్రదం. ఎదురుగా కిళ్ళీ కొట్టు. అరటి పళ్ళ గెలలతో, రంగుల సీసాలతో సినిమా బొమ్మల్తో అందంగా ఉంది. చంద్రదం కిళ్ళీకొట్టు ముందు కెళ్ళి నిలబడ్డాడు. కొంత సేపటికి కిళ్ళీ కొట్లో మనిషి కిందికి దిగాడు. పేలాడ గట్టిన అరటి గెలల్ని ఒక్కొక్కటి ఇల్లమీద పెట్టి కాయల్ని లెక్క పెట్టసాగాడు. ఆ మనిషి అటు వైపు తిరగడం చూసి, చంద్రదం గబుక్కున ఒక గెలలోని నాలుగు పళ్ళు, లాగి చేత్తో పట్టుకొని పరుగు లంకించు కున్నాడు తన నెవరో తరుముకు వస్తున్నట్లు భయంతో వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు పరుగెత్తాడు. పరుగెడుతూ ఆంజనేయస్వామి గుడి దగ్గర ఆగాడు. తను చేసిన పనికి చంద్రదానికి ఎంతో గర్వంగా ఉంది. ఏదో సాధించానన్న తృప్తి కలిగింది.ఆనందంగా మెట్ల మీద కూర్చుని నాలుగరటి పళ్ళు నెమ్మదిగా తినేశాడు. గడిదగ్గర కుళాయి తిప్పుకొని మంచినీళ్ళు కడుపు నిండా త్రాగాడు. చంద్రదానికి ఆకలి తీరింది.

"అయ్యా బాబూ! కళ్ళులేని కబోధిని తండ్రీ! ధర్మం చెయ్యండి బాబూ నాయనా!" ఎవరో గుడ్డి ముసలమ్మ కర్ర సాయంతో నడుస్తూ అడుక్కుంటూంది. దారిన పోయే వాళ్ళు ఆ ముసలమ్మ డబ్బాలో డబ్బులు వేస్తున్నారు. చంద్రదం ఆ ముసలమ్మనే చూస్తూ దగ్గరగా వెళ్ళి కర్ర పట్టుకున్నాడు.

"ఎవరు నాయనా!" గుడ్డి ముసలమ్మ అడిగింది.

"నేను మామ్మా! చంద్రదాన్ని. నేనూ నీతో రానా?"

"నా నాయనే! రా, బాబూ! అంత కంటేనా? నీకు బోల్డు డబ్బులిస్తాను. బువ్వెడతాను. తాయిలం కొని పెడ్తాను. నాదగ్గరే పడుకోబెట్టు కుంటాను." చంద్రదాన్ని ముసలమ్మ దగ్గరగా తీసుకుని ముద్దు పెట్టు కుంది. ఒళ్ళంతా నిమిరింది. చంద్రదం ఉత్సాహంగా కర్ర పట్టుకుని "మామ్మా! ఇంకెప్పుడూ నీ దగ్గరే ఉంటా" నంటూ తాను ముందు నడుస్తూ ముసలమ్మను నడిపించ సాగాడు. చంద్రదానికిప్పుడు అమ్మా అవసరం లేదు. ఆకలీ అంత కంటే లేదు. చేతిలోని పలక మీది అక్షరాలు అ, ఆ లు చేతో చెరిపేసి పలకను పెంట మీదికి విసిరేశాడు. *

మనసైనవాడిని పులకింప చేసే అపురూప సఖి సౌందర్యం!




స్టెప్ గోళ్ళ ఎనామిల్
తక్కువ ఖర్చులో మరింత
అందంకోసం. కేవలం
ఒక్కసారి వేసుకుంటేనే!
స్టెప్ ఎక్కువకాలం నిలుస్తుంది.
అపూర్వంగా.... మిమ్మల్ని చూస్తే
తలతిప్పుకోలేనంతగా మరింత
అందాన్ని సమకూరుస్తూ.
వాడిచూస్తే మీకే తెలుస్తుంది.
మీ గోళ్ళ రంగుకు జతగూర్చేలా
పెదవులను తీర్చిదిద్దుకోండి.
రంగురంగుల స్టెప్ లిప్‌స్టిక్ శ్రేణితో.
లిప్‌స్టిక్ ప్లెయిన్‌తో
పాటు ఫ్రాస్టెడ్
రూపంలో కూడా
దొరుకుతుంది.

స్టెప్ వాడండి!
మనసు దోచండి!

Step®
కాస్మెటిక్స్

ఎ-233, 'వై' రోడ్, వాఘలే ఇండస్ట్రియల్ ఎస్టేట్, పోస్ట్ బాక్స్ నం. 412, థానా 400 604.

Swastika/SC/1163 TL.